దవాఖానను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

వెయ్యి పడకలతో ప్రజలకు అధునాతన వైద్యం

కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట, జులై 31: ప్రజలకు అధునాతన ఉచిత వైద్య సేవలు అందించేందుకు నిర్మించిన వెయ్యి పడకల దవాఖానలో అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ మను చౌదరి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో గల వెయ్యి పడకల దవాఖానను టీజీఎంఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు, మెడికల్ కళాశాల దవాఖాన సూపరింటెండెంట్ కిశోర్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖాన ఐదో అంతస్తులో తిరిగి నిర్మించిన గదులను పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి రెండు అంతస్తులు అత్యవసర వైద్య సేవలతో పాటు ముఖ్యమైన విభాగాల వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వస్తువులను సిద్ధం చేయాలని టీజీఎంఐడీసీ ఈఈ శ్రీనివాస్, డీఈ విశ్వప్రసాద్‌లను కలెక్టర్ ఆదేశించారు. దవాఖానకు మంజూరైన వైద్యులు, వైద్య సిబ్బంది సంఖ్య ఎంత అని, ప్రస్తుతం ఎంతమంది పనిచేస్తున్నారని సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వాటి వివరాలు అందించాలని సూపరింటెండెంట్ కిశోర్ కుమార్‌ను ఆదేశించారు.

ఉద్యోగ విరమణ జీవితంలో సర్వసాధారణం

సరోజ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, జూలై31 : జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సరోజ అంకిత భావంతో విధులు నిర్వహించి సమర్థవంతంగా అధికారిగా గుర్తింపు పొందారని కలెక్టర్ మను చౌదరి కొనియాడారు. బుధవారం జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సరోజ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో అధికారులు నిర్వహించారు. సరోజ దంపతులను కలెక్టర్, అధికారులు సన్మానించారు. జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, గరిమాఅగర్వాల్, డీఆర్‌వో నాగరాజమ్మ, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, డీపీవో దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు15 లోగా పూర్తి చేయాలి

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 31: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ఆగస్టు 15 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి నిర్మాణ పనులపై విద్యా శాఖ, పంచాయతీ రాజ్ ఈడబ్ల్యూడీసీ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 804 ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను పెంచుటకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మరుగుదొడ్లు, తాగునీరు, మైనర్ రిపేర్లు, కిషెన్‌షెడ్లు, కాంపౌండ్ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు తదితర పనులను చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 724 పాఠశాలలో చేపట్టిన నిర్మాణాలను పూర్తి చేశామని, మరో 80 పాఠశాలల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఆగస్టు 15 లోగా 80 పాఠశాలల నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత నిర్మాణ ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి, పంచాయతీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరి ఆవిష్కరించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు ఒకటి నుంచి 7తేదీ వరకు జరుగుతాయన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

మిట్టపల్లిలోని బాలుర సంక్షేమ హాస్టల్‌ను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేత మేర్గు మహేశ్

సిద్దిపేట అర్బన్, జూలై 31: కాంగ్రెస్ హయాంలో సంక్షేమ హాస్టళ్లను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మేర్గు మహేశ్ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని బాలుర సంక్షేమ హాస్టల్‌ను సందర్శించి అనంతరం మాట్లాడారు. విద్యార్థులతో మాట్లాడి హాస్టల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నామని, హాస్టళ్లను పర్యవేక్షించడంలో సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని కాపాడుకునే దానిపై ఉన్న శ్రద్ధ విద్యాశాఖ మంత్రిని నియమించడంలో లేదని అన్నారు. ఇప్పటికైనా శాఖ మంత్రిని నియమించి అధికారుల పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలన్నారు. పయ్యావుల శ్యామ్, సురేశ్, ఇషాక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు

బోనాలతో వస్తున్న మహిళలు

హుస్నాబాద్, జూలై 31: హుస్నాబాద్ పట్టణంలోని జాంబవంతుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. ఉదయం పోచమ్మ బోనాలు, సాయంత్రం ఎల్లమ్మకు బోనాలను సమర్పించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు జరిగింది. ప్రతి ఆషాఢ మాసంలో పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటామని సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గడిపె సారయ్య, ముత్యాల రామస్వామి, బత్తుల అంతయ్య, గడిపె ఎల్లయ్య, కోరెపు లక్ష్మణ్, డప్పు రాజు, గడిపె రాజు, సంజీవ్, సతీశ్ కుమార్, బొజ్జ సది, మహేందర్, రమేశ్, జే సంజీవ్, పెద్ద సంఖ్యలో మహిళలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మాజీ మహిళా మంత్రిని అవమానించడం సరికాదు..

మాజీ ఎంపీపీ లింగాల నిర్మల

బెజ్జంకి, జూలై 31 : అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిపై ముఖ్యమంత్రి చేసిన వాఖ్యలు సరికాదని మాజీ ఎంపీపీ లింగాల నిర్మల అన్నారు. మండల కేంద్రంతో స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల కాంగ్రెస్ వ్యవహరించే తీరు ఇదేనా అని ప్రశ్నించారు. సీనియర్ మాజీ మహిళామంత్రి, ఎమ్మెల్యేను ముఖ్యమంత్రి అవమానించడ మంటే, రాష్ట్రంలోని మహిళ సమాజాన్ని అవమాన పరిచడమేనన్నారు. ముఖ్యమంత్రి తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రారంభోత్సవ ఖర్చులో కమిషనర్, చైర్మన్‌లదే పాత్ర

మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు

గజ్వేల్, జూలై 31 : మున్సిపల్ నూతన కార్యాలయ భవన ప్రారంభోత్సవం రోజు పెట్టిన ఖర్చులో అప్పటి మున్సిపల్ కమిషనర్, అధికారులు మున్సిపల్ చైర్మన్‌లదే పాత్ర ఉందని పట్టణ కౌన్సిలర్లకు ఎలాంటి సంబంధం లేదని విషయాన్ని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు గుర్తించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు శిరీషా రాజు, అల్వాల బాలేశ్, చందనా రవీందర్, రజిత, శ్యామలామల్లేశం, లక్ష్మీకిషన్‌రెడ్డి, వర లక్ష్మీ కనకయ్య, బాలమణి, అత్తెల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ అన్నారు. బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశం అనంతరం వారు మాట్లాడారు. కౌన్సిలర్లపై నిరాధార ఆరోపణలు చేయకూడదని కాంగ్రెస్, బీజేపీ నాయకులకు సూచించారు. కేసీఆర్ సహకారంతో గజ్వేల్‌లో కోట్లాది రూపాయల పనులు పూర్తి చేసుకున్నమన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సమయ పాలనేది ?

తహసీల్ కార్యాలయంలో 11 గంటలకు ఖాళీగా కనిపిస్తున్న సీనియర్ అసిస్టెంట్ కుర్చీ

బుధవారం 11 గంటలకు ఖాళీగా కనిపిస్తున్న తహసీల్దార్ కుర్చీ

మండల పరిషత్ కార్యాలయంలో 11 గంటల తర్వాత ఖాళీగా కనిపిస్తున్న ఎంపీడీవో కుర్చీ

- ఉదయం 11 గంటల కూడా కార్యాలయానికి రాని అధికారులు
- ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్న రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయం ఉద్యోగులు
- అధికారుల రాకపోకలపై అసహనం వ్యక్తం ప్రజలు

అక్కన్నపేట, జూలై 31 : మండల కేంద్రంలోని రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. బుధవారం తహసీల్ కార్యాలయానికి తహసీల్దార్ సహా సీనియర్ అసిస్టెంట్, ఆర్- 1, ఆర్ఐ-2, రికార్డ్ అసిస్టెంట్, మరో ఒక్కరి ద్దరూ ఉద్యోగులు ఉదయం 11 గంటల వరకు కూడా రాలేదు. ఇదే విషయంపై తహసీల్దార్ అనంతరెడ్డిని వివరణ కోరగా, తాను హుస్నాబాద్ ఆర్డీవో ఆఫీసులో ఉన్నానని, ఆర్-1 జ్వరంతో ఉన్నాడని, మరో ఆర్ఐ -2, సీనియర్ అసిస్టెంట్, ఒక్కరిద్దరూ ఉద్యోగులకు మాత్రం ఈ రోజు ఆలస్యమైందన్నారు. ఇదిలా ఉంటే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జయరామ్ సహా ఎంపీవో రవికుమార్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ పదకొండు గంటలు దాటినా విధులకు హాజరుకాలేదు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు ఉన్నా మండల పరిషత్ ఉద్యోగులు ఇదే అదునుగా భావించి సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కోసారి ఇటు మండల పరిషత్ కార్యాలయం పేరు, ఒక్కోసారి అటు గ్రామ పంచాయతీల్లో ఉన్నామంటూ పొంతన లేకుండా సమాధానాలు చెప్పుతూ విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయంపై ఎంపీడీవో జయరామ్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. కాంగ్రెస్ పాలనలో క్షేత్ర స్థాయిలో ఉన్న రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతుండటంపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమయ పాలన పాటించని ఉద్యోగులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాడి పశువుల కొనుగోలుపై రైతులకు అవగాహన

హుస్నాబాద్‌రూరల్, జూలై 31: హుస్నాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం రైతులకు పాడి పశువుల కొనుగోలుపై అవగాహన సమావేశం జరిగింది. జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి పథకం కింద పాడి పశువుల కొనుగోలు కోసం ఎంపికైన రైతులతో ఈ సమావేశం నిర్వహించారు. పాడి పశువుల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి పెంపకం తదితర అంశాలపై పశువైద్యాధికారులు అవగాహన కల్పించారు. వెటర్నరీ ఏడీ వెంకట్‌రెడ్డి, పశువైద్యాధికారులు డాక్టర్ రమేశ్, ఏపీఎం శ్రీనివాస్, స్త్రీనిధి ఆర్ఎం మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నిశాంత్ రెడ్డి, సీసీలు అశోక్, రవీందర్, జితేందర్, రైతులు పాల్గొన్నారు.

కుక్కల బెడద లేకుండా చూడాలి

గజ్వేల్, జూలై 31: ఎనిమల్ బర్త్ కంట్రోల్ లేదా బూక్రాస్ వారిని సంప్రదించి కుక్కల బెడద లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అన్నారు. బుధవారం సాధారణ సమావేశంలో రెండు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. వర్షాకాలం దృష్యా సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. సమావేశంలో పలు కీలక అంశాలపై పాలక మండలి సభ్యులు చర్చించారు. వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కమిషనర్ నర్సయ్య, కౌన్సిలర్లు కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

పోలీస్ కమిషనర్ అనురాధ

కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న సీపీ డాక్టర్ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 31: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని, నేటి మొక్కలే రేపటి వృక్షాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టరర్ అనురాధ అన్నారు. బుధవారం కమిషనరేట్ కార్యాలయ ఆవరణ పరేడ్ గ్రౌండ్‌లో వనమహోత్సవంలో భాగంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడాలంటే మొక్కలు చాలా ముఖ్యమన్నారు. భావితరాలను దృష్టిలో పెట్టుకొని మొక్కలను నాటాలని సూచించారు. బుధవారం ఒక్క రోజే కమిషనరేట్ కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందితో 800 మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కలను సంరక్షించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన గీత కార్మికులు

పెద్దరాజుపేటలో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది

చేర్యాల, జూలై 31 : మండలంలోని పెద్దరాజుపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గీత కార్మికులతో కలిసి ఎక్సైజ్‌శాఖ అధికారులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై సురేశ్ మాట్లాడుతూ చేర్యాల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో గీత కార్మికుల సంక్షేమం కోసం నాటుతున్న ఈత మొక్కలను సంరక్షించుకోవాలన్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది, గీత కార్మికులు పాల్గొన్నారు.

మొక్కలకు ట్రీగార్డుల ఏర్పాటు

హుస్నాబాద్‌టౌన్, జూలై 31: పట్టణంలో మొక్కల సంరక్షణపై ఎట్టకేలకు అధికారులు నడుంబిగించారు. పలు వార్డుల్లో మొక్కల పెంపకం కోసం గుంతలు తీయడం, మొక్కలకు ట్రీగార్డులను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. స్థానిక రెండోవార్డులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హరితహారం సూపర్‌వైజర్ జాలిగాం శంకర్, బోజు రవిందర్‌తోపాటు పలువురు ఉన్నారు.

సీపీ కేసులపై సమీక్ష

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 31: ఆఫ్ ఇయర్లీ కేసులపై కమిషనరేట్‌లో బుధవారం పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారుడితో సంబంధిత ఎస్సై తప్పకుండా మాట్లాడి సమస్య తెలుసుకొని పరిష్కరించాలన్నారు. తరచుగా నేరాలు చేసే నేరస్తులపై తప్పకుండా షీట్స్ ఓపెన్ చేయాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, పేకాట, జూదం తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కు పాదంతో అణిచివేయాలన్నారు. మహిళల రక్షణకు పెద్దపీట వేయాలన్నారు. ప్రతి అధికారి నిజాయితీగా విధులు నిర్వహించి, విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలు జరగకుండా ప్రో యాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, ఏసీపీలు మధు, సతీశ్, రవీందర శ్రీనివాస్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బందులు కలిగించొద్దు

దవాఖానలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జూలై 31: దవాఖానకు వచ్చే రోగులకు వైద్యసాయం అందించే విషయంలో ఇబ్బందులకు గురిచేయకుండా సేవలందించాలని మున్సిపల్‌చైర్ పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. అప్నాబీమారి భగావో కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానను బుధవారం సందర్శించారు. అనంతరం దవాఖానకు వచ్చిన రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, వైద్యులు జయంత్, సంజీవ్, కౌన్సిలర్ కొంకట నళినిదేవి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారులు, మున్సిపల్, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారులకు ఉపాధి కల్పించాలి

హుస్నాబాద్, జూలై 31: తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసేందుకు రాత్రింబవళ్లు పర్యటనలు చేసి కళా ప్రదర్శనలు చేసిన కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలని ఉద్యమ నిరుద్యోగ కళాకారుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్‌లో జరిగిన ఐక్యవేదిక సమావేశంలో వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం హయాంలో 550 మంది కళాకారులకు ఉపాధి కల్పించిందని, మిగతా కళాకారులకు కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుందనే ఆశలో ఉన్నామన్నారు. ఎన్నికలకు ముందు ఉద్యమ కళాకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఒకసారి కళాకారుల సంక్షేమంపై దృష్టిసారించాలని కోరారు. ఐక్యవేదిక నాయకులు కొడముంజ రవీందర్, తాడూరి సురేశ్, కనకం వెంకట్, గడిపె చిన్న, బోనగిరి శ్రీకాంత్, బోయిని సుమన్, పొన్నాల అశోక్, పున్న సంపత్ ఉన్నారు.

ఎస్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

హుస్నాబాద్, జూలై 31: పట్టణంలో అసౌకర్యాల మధ్య, అద్దె భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఎస్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ బృందం ఆధ్వర్యంలో హాస్టల్‌ను తనిఖీ చేసి సౌకర్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, కాస్మోటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలని, శాశ్వత పక్కా భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు బన్నీ, వంశీ, శ్రీకాంత్, తిరుపతి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 31 : కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి కొంత మంది వ్యక్తులు కలిసి పేకాట ఆడుతున్నారని సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కుకునూరుపల్లి పోలీసులు కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ. 20,500 నగదు, 3 మోటర్ సైకిళ్లు, ఒక ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 871 266 7446లకు సమాచారం అందించాలని, పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదు..

పీఈటీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

బెజ్జంకి, జూలై 31: ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పదని, వారు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి అన్నారు. మండలంలోని దాచారం ఉన్నత పాఠశాల పీఈటీ బండారిపల్లి శ్రీనివాస్‌ను ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ పీఈటీగా శ్రీనివాస్ ఎంతో మంది విద్యార్థులను మంచి క్రీడాకారులను తీర్చిదిద్దడరన్నారు. పాఠశాలకు కంప్యూటర్లు, వాటర్‌ప్యూరిఫైయర్‌లను ఇస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. అనంతరం శ్రీనివాస్ దంపతులను ఎమ్మెల్సీ, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. ఎంఎన్‌వో మహతిలక్ష్మి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 31 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారు రోడ్డు ప్రమాదంలో ఒవ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని నాగారానికి చెందిన గుడ్ల చంద్రశేఖర్ ఉద్యోగ రీత్యా మంగళవారం ఇన్నోవా కారులో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లి పని ముగించుకొని తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో తిమ్మారెడ్డిపల్లి శివారులో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వాహనాన్ని ఢీ కొట్టింది. ఈఘటనలో ఇన్నోవా కారు స్టీరింగ్ చంద్రశేఖర్ చాతిలో బలంగా తాకడంతో అక్కడిక్కడి మృతిచెందాడు. కాగా చంద్రశేఖర్ మేనల్లుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపాడు.

బైక్ అదుపుతప్పి..

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందిన సంఘటన కుకునూరుపల్లి మండలంలోని చిన్నకిష్టాపూర్ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలంలోని ఎల్కల్‌కు చెందిన తొర్రి దర్శన్ (21) మంగళవారం సాయంత్రం బైక్‌పై సిద్దిపేటకు వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లి తిరికి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో చిన్నకిష్టాపూర్ క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో తలకు తీవ్రగాయాలైన దర్శన్‌ను 108 అంబులెన్స్ సిబ్బంది గజ్వేల్ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక డంప్ సీజ్

బెజ్జంకి, జూలై 31: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన గూడేల్లి శ్రీనివాస్ ఇంటి పరిసరాల్లో అక్రమంగా ఇసుక నిల్వ చేశారన్న సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు 40 టన్నులు ఇసుక డంపును పట్టుకొని, సీజ్ చేసినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనదారులకు జరిమానా

సిద్దిపేట టౌన్,జూలై 31: మద్యం తగి వాహనాలను నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం జరిమానా, జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించింది.ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సిద్దిపేట ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. మద్యం తాగి వాహనాలను నడుపుతున్న 21 మందిని పట్టుకున్నామని వెల్లడించారు. ఈ మేరకు న్యాయమూర్తి శ్రావణి యాదవ్ ఎదుట హాజరు పరుచగా, విచారణ జరిపిన న్యాయమూర్తి ఎదుట బాబులకు రూ.13వేల జరిమానా, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

చినుకు పడితే చిత్తడే..

దుబ్బాక మండలం పద్మనాభునిపల్లిలో చిన్నపాటి వానకు బురదగుంతలతో ప్రమాదకరంగా మారింది. ఈ సందర్భంగా రోడ్డుపై వరినాట్లు వేసి గ్రామ యువకులు నిరసన తెలిపారు.

-దుబ్బాక, జూలై 31

బియ్యం ఎగుమతికి రేక్‌పాయింట్ ప్రారంభం

గజ్వేల్, జూలై 31 : గజ్వేల్‌లోని రైల్వే గూడ్ షెడ్‌లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన బియ్యాన్ని ఎగుమతి చేయుటకు బుధవారం రేక్ పాయింట్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ కృషితో గూడ్‌షెడ్ రావడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ రేక్ పాయింట్‌ను రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రాజు, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, డీఎం అజారొద్దీన్, టీఏ రాం మ్మోహన్, ఎఫ్‌సీఐ మేనేజర్ జానకిరాం, గోదాం యజమాన్యం చెప్యాల రాజురావు, నవీన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి కుక్కకాటు

గజ్వేల్, జూల